



ఒక చిన్న రైల్వేస్టేషను, అది. ఎటువంటి సమయంలోనూ రద్దీగా వుండదు. ఆ స్టేషను వల్ల అటు ప్రభుత్వానికిగాని యిటు ప్రజలకుగాని కలిగే లాభం బహు స్వల్పం అని సులువుగా అర్థమవుతుంది. ఆ ప్లాట్‌ఫారం మీద పాదరక్షలు లేకుండా నడవడం ఒకవిధంగా కష్టమే. ఎందుకంటే గులకరాళ్లు బైటికి తేలివుండి రక్షణలేని పాదాలకు గుచ్చుకొని బాధ పెడతాయి. ప్రయాణీకులు కూర్చోటానికని వుద్దేశించబడిన సిమెంటు బెంచీలు మూడున్నాయి. స్టేషనుకి రెండు చివర్లందు రెండు, స్టేషను మాస్టరుగదికి కొంచెం యెడంగా, స్టేషను మధ్య ఒకటి. మధ్య బెంచీమీద కూర్చొని వున్నాడు విశ్వేశ్వర శాస్త్రి. అతడు, ఆకారంబట్టి, యెక్కడికో ప్రయాణం తలపెట్టినట్టుగా వున్నాడు. అతని కళ్లు పీకసవడి వున్నాయి. ఐనా, ప్రయాణం పట్ల ప్రశాంతం అగుపిస్తుంటవే ఒక కొత్త వుబలాటం, ఆశాభావం మధ్య మధ్య సోలసిన అతని కన్నుల్లో ద్యోతకమౌతూంది.

'అతనికి కావలసిన రైలు యాభైయైదు నిమిషాలు లేటట' స్టేషను మాస్టరు చెప్పాడు. ఐనా ఆ లేటుకు విసుక్కోలేదు విశ్వేశ్వరశాస్త్రి. అసలు విసుక్కోవలసిన అవసరం ఒకటున్నదని తట్టలేదు అతనికి ఆ సమయంలో. ప్లాట్‌ఫారం అవతల నాలుగైదు వేపచెట్లు భారీయెత్తున వుండి, చల్లని నీడని గాలిని యిస్తూ మనిషికి మనిషివల్ల కలిగే చింత, చికాకుల్ని విచ్ఛిన్నం చేస్తున్నాయి. ఐనా, విశ్వేశ్వర శాస్త్రియొక్క మనోప్రపంచం మాత్రం చిక్కుపోయిన సెలయేరులా వుంది, నిజ ప్రపంచం యెంత వుల్లాసకరంగా వున్నా. అతని వళ్ళని జాతు యెగిరెగిరి పడుతున్నాది. ఏమిటో ఆలోచిస్తున్నాడు. అలా కూర్చొని ఆలోచిస్తున్న విశ్వేశ్వరశాస్త్రికి దూరాన నల్లని రైలుపొగ కనిపించింది. ఏదో రైలొస్తున్నాది అని అనుకున్నాడు. రైలొచ్చింది. కాని అక్కడ ఆగకుండా యెంత హడావిడిగా వచ్చిందో అంత హడావిడిగానూ పారిపోయింది చాస్సి చూస్తూ. 'అంత తొందర పనికిరాదు' అని తనలో అనుకున్నాడు విశ్వేశ్వరశాస్త్రి.

రైలు వెళ్లిపోయింది అది విడిచిపెట్టిన కల్మషం ఆకాశంలో చెదిరి కరిగి పోతున్నాది. ఆ పొగను యెంతవరకు చూడగలనో అని పట్టిపట్టి చూస్తున్నాడు అతడు. సరిగ్గా అప్పుడే స్టేషను మాస్టరు గదిలో టెలిఫోను మ్రోగింది. అదికూడ వింటున్నాడు. ఇంతలో, ఆ సమీప ప్రాంతంలో ఒక పెద్ద ప్రేలుడు శబ్దం అయ్యింది. విశ్వేశ్వరశాస్త్రి ఒక్కసారి అదిరిపడి 'అమ్మో రైలు పడిపోయింది' అని భయంగా గొణుక్కున్నాడు. అప్రయత్నంగా తన సూట్‌కేస్, బేగ తడుముకొని శబ్దం వినవచ్చినవేపు చూసాడు.

విశ్వాసంగా, శ్రేయోభిలాషిగా. తనే!

వంకతిరిగి ప్రశాంతంగా రైలు పాములా సాగిపోతూనే వుంది. మరి ఆ శబ్దం యేమిటి?' భయభ్రాంతులనుండి నింపాదిగా తేరుకున్నతర్వాత గ్రహించాడు విశ్వేశ్వర శాస్త్రి ఆ శబ్దమేమిటో—కొండరాళ్ల ప్రేలుడు మందేసి పేలుస్తున్నారు కూలీలు.

అసలు సంగతి తెలుసుకున్నాక 'ఉత్తినే భయపడ్డాన్రా దేవుడా' అనుకొంటూ చాలా సేపు నవ్వుకున్నాడు.

స్టేషను మాస్టరు తన గదిలో నుండి ఠీవిగా, మహారాజులా బైటికి వచ్చాడు. వచ్చి 'ఒరే పరమేశం గంటకొట్టు' అన్నాడు. అతని కంఠస్వరం గంభీరంగా లేదు. కాని గంభీరత ప్రదర్శించటానికి కావలసిన ప్రయత్నమంతా చేసినట్టుగానే వున్నాడు స్టేషనుమాస్టరు. అతన్ది పెద్దవయస్సేమీ కాదు. చిన్నవయస్సులోనే మంచి వుద్యోగం సంపాదించాడు. ఆరోగ్యవంతమైన శరీరం అతన్ది.

'ప్రశాంతమైన వాతావరణం అతనికి ఆ ఆరోగ్యాన్నిచ్చింది' అనుకున్నాడు విశ్వేశ్వరశాస్త్రి సెలయేరులా సజీవంగా, చల్లగా వున్న ప్రకృతిని చూస్తూ. 'బడిపంతులు వుద్యోగానికి రాజీనామా యిచ్చేసి యిక్కడే వుండిపోతే బావుంటాది. అదిగో ఆ చెరువు గట్టుమీద ఒక చిన్న కుటీరం కట్టుకొని' అని యోచిస్తున్నాడు విశ్వేశ్వరశాస్త్రి.

అంతలోనే అతని యోచన మరోవేపుకి మళ్ళినట్టు కుంచించుకుపోయిన అతని కళ్లు చెప్పాయి.

'అతడు, ఆ స్టేషనుమాస్టరు వయస్సులో తను యెంత అశాంతిగా వుండేవాడు, పెళ్ళాంలేదు. బాధ్యతకు అర్థం తెలిసేది కాదు. తనమీద తనకే బాధ్యత వుండేది కాదు. అందుకే అతనంత మంచి ఆరోగ్యం తనకు యెప్పుడూ లేదు.' అని యిలా అనుకుంటూన్నాడు, 'ఎందుకుంటుంది? యెలావుంటుంది? మనస్సులో శాంతిలేనప్పుడు ఆరోగ్యం యెక్కడనుండి వస్తుంది? నేను పెళ్ళాడనన్నానని బావిలో వురికి చచ్చిన శాంత చేసింది బ్రతుకంతా నాశనం. శాంతి అనేది బ్రతుకులో లేకుండా చేసింది శాంత. కనీసం ఆత్మహత్య చేసుకుంటాననైనా చెప్పలేదు పాడుపిల్ల చచ్చే ముందు. పాపం! చచ్చినదాన్ని. [illegible] కోపమెందుకులే. ఇంతా బ్రతుకులో శాంతం లేకుండా చేసింది శ్యామలకాదా? అది తనను అభిమానించిందనే కదా శాంతను తిరస్కరించేడు తను. ఏమిటో, చివరికి యేదీ లభ్యం కాక యెడారయ్యింది మిగిలినదంతా. అని యిలా తలపోస్తూ గతం యొక్క చిక్కటి రంగులు పులిమిన చిత్రపటానికి ఫ్రేమ్ కడుతున్నాడు విశ్వేశ్వరశాస్త్రి.

పరమేశం గంటకొట్టాడు.

బండి వచ్చేస్తున్నాదేమో అని చూశాడు. కనుచూపు మేరలో అటువంటి సూచన లేనిగా కన్పించకపోయేసరికి స్టేషను మాస్టర్ని అడిగాడు శాస్త్రి.

'ఎందుకయ్యా అంత తొందరపడతావ్. సీదారిన పోయేబండి యాభైయ్యైదు నిమషాలు లేటని చెప్పాను కదా. ఇంక అరగంట పోతేనే కాని రాదు. ఇప్పుడొచ్చేది యింకో దారిన పోయేబండి' అని విసుక్కున్నాడు స్టేషనుమాస్టరు.

'ఓహో, యింకా అరగంట పోవాలా నా బండి రావటానికి' అని బాధగా అంటూ వెళ్లి తన మొదటిజాగాలో, సిమ్మెంటు బెంచీమీద కూర్చున్నాడు విశ్వేశ్వర శాస్త్రి. ఆ వస్తూన్న రైలు అతనికి కావలసిన రైలు కానందుకు కాదు బాధ, కనీసం అతన్నొక పెద్దమనిషిగానైనా గుర్తించకుండా స్టేషనుమాస్టరు అనవసరంగా మర్యాద పాటించకుండా విసుక్కున్నందుకు కలిగింది బాధ. విశ్వేశ్వరశాస్త్రికి

ఇలాంటిస్థితిలో కలిగిన మనోక్లేశం చాలా తడవలు జరిగింది అతనికి—నెమ్మదిగా నెట్టుకువచ్చిన ముప్పై తొమ్మిదేళ్ల బ్రతుకులో. శాస్త్రి తొందరపడి దూకుడుగా ప్రవర్తించడమనేది తగ్గించుకోవాలని ప్రయత్నం చేశాడు. మనిషిని ప్రకోపింపజేసే కొన్ని విషయాలపట్ల సహనంగా వుండాలని జాగ్రత్తపడుతూనే వస్తున్నాడు. ఐనా యిప్పుడు స్టేషనుమాస్టరు అనవసరంగా విసుక్కున్నాడని తెలిసికొని కొద్దిగా బాధపడ్డాడు. అప్పుడాలోచించాడు యెందుకు బాధపడ్డానా అని. అతనికి నవ్వొచ్చింది.

'సాధారణంగా ఒకమనిషిని చూసిన తర్వాత అతనితో పరిచయం అయ్యేంతవరకు వెళ్లక పూర్వమే ఆ వ్యక్తిమీద మంచో, చెడో ఒక అభిప్రాయం మన ప్రయత్నం లేకుండానే యేర్పడ్డం జరుగుతుంది. వింతగా తొలిసారి స్టేషనుమాస్టర్ని చూసాక అతనిమీద మంచి అభిప్రాయం యేర్పడలేదు తనకి. మనిషి ఆరోగ్యంగా వున్నంతమాత్రాన అతని ముఖంలో మంచితనం పొడసూపే భావం వుండాలనేమీ లేదు కదా. అందుకే, అతనంటే సదభిప్రాయం తోచని స్టేషనుమాస్టరే తనపై చికాకు అసహనం చూపించేసరికి, అతనికి సమాధానంగా యేమీ జవాబివ్వలేని స్థితిలో తనకు బాధకలిగింది' అనుకున్నాడు విశ్వేశ్వర శాస్త్రి.

అంతవరకు పంచె అంచు పట్టుకొని ఆలోచిస్తున్నవాడల్లా, అది విడిచిపెట్టి బెంచీమీదనుండి లేచి ప్లాట్‌ఫారంమీద నడక సాగించాడు. పైకి తేలివున్న కొద్దిగా పెద్ద సైజు రాయిల్ని తన్నుతూ యిరవై అడుగులు నడిచాడేమో, అంతలో, అరెరె నా సూట్‌కేస్, బేగ అక్కడే వుండిపోయాయి అనుకొంటూ తిరిగి బెంచీదగ్గిరికి వచ్చి ఆ ప్రక్కనే పచార్లు సాగించాడు, ఆ వస్తువులకు కావలా కాస్తున్నట్టు.

ఎట్టకేలకు అతడు యెక్కవలసిన రైలొచ్చింది. ఎవరో యిద్దరు దిగారు ఆ స్టేషన్లో. ఎక్కినవాడు మాత్రం శాస్త్రి ఒక్కడే. కంపార్టుమెంటులో సీటు సర్దుకొని, తన సూట్‌కేస్, బేగ్ అక్కడ వుంచి తలుపు దగ్గిరికొచ్చి నిల్చున్నాడు. ఒకసారి దూరానికి దృష్టి సారించాడు అక్కడ, ఒక పెద్దగుట్టమీద వున్న గుడి తెల్లని చిన్నమువ్వ ఆకారంలో కనిపిస్తున్నాది. ఆ గుట్టప్రక్కనే తను బడిపంతులుగా పనిచేస్తున్న గ్రామం వుంది ఆ గ్రామంలో ఒక రైతుపిల్ల. ఆమెలో శ్యామల పోలికలు చాలా వున్నాయి. పేరుకూడ సీల!

'తనలో వున్న అశాంతికి యెలాగైతే అర్థంలేదో, అలాగే తన అభిప్రాయాలు ఒక్కొక్కసారి తనకే అర్థం కావు—తనకు ప్రశాంతత లభించే మార్గం కరువయ్యిందని. దానికోసమే ఒక మారుమూల గ్రామం యెన్నుకున్నాడు తను. అక్కడ రెండేళ్లున్నాడు కూడ ఇప్పుడేమైందని? అక్కడ సైతం శాంతి లభించే అవకాశం కరువయ్యిందనా ఈ ప్రయాణం?' యిలా ఆలోచిస్తున్నాడు విశ్వేశ్వరశాస్త్రి.

గార్డు విజిల్ వూదాడు. రైలు 'కుయ్యోం' మన్నాది.

స్టేషను మాస్టరు ప్లాట్‌ఫారంమీద నిల్చొని తనవేపే చూస్తున్నాడనే విషయం గమనించాడు శాస్త్రి. శాస్త్రికూడ కొంచెం సేపు అతన్ని చూసాడు.

'ఎందుకలా చూస్తున్నాడు ... వీడ్కోలిస్తున్నట్టు' అనుకున్నాడు.

రైలు కదిలిపోతున్నది. అప్రయత్నంగా చెయ్యూపాడు శాస్త్రి! స్టేషనుమాస్టరు కూడ చెయ్యూపాడు, బదులుగా. తర్వాత తన సీట్లో కెళ్లి కూర్చుంటూ 'చిత్రం' అని వుచ్చరించాడు నోట్లో శాస్త్రి.

ఒక కుర్రవాడు ఆ కంపార్టుమెంటు చివర శ్రావ్యంగా గొంతెత్తి సినిమాపాట పాడుతున్నాడు. దానికి లయ వేస్తున్నాది రైలు. సాధారణంగా యెటువంటి పాట పాడినా దానికి రైలు తాళం వేస్తున్నట్టే వుంటుంది. పాట వింటూ, 'గానంలో సుఖం, శాంతి వున్నాయి సుమీ' అనుకొంటూ తలూపాడు శాస్త్రి. రైలు వూపులకు కొద్దిగా నిద్ర కమ్మింది. అలా యెంతసేపు మతు కమ్మిందో, పాడుతున్న అబ్బాయి వొచ్చి 'బాబూ' అని పిలిచే సరికి తెలివొచ్చింది శాస్త్రికి. ఎదురుగా కూర్చొని వున్న ముసలాయన యెంతో యిచ్చాడా అబ్బాయికి. ఆ అబ్బాయి తనమూ అడిగేసరికి 'చిల్లరలేదు' అని ఒక మాట అనేసి వూరుకున్నాడు శాస్త్రి. కుర్రవాడు వెళ్లిపోయింతర్వాత జేబు తడుము కున్నాడు. జేబులో చిల్లర డబ్బులున్నాయి. కొద్దిగా బాధ కలిగింది శాస్త్రికి.

'పిల్లదంతా నాటకమండీ. అనాథల మాదిరిగా వచ్చి మనమీద పడతారు. అంతా వట్టి అబద్ధం. మీకు తెలీదేమో పిల్లనీ పని చెయ్యమని చెప్పి వాళ్ల తల్లిదండ్రులే పురికొల్పుతారు. అ' అన్నాడు విశ్వేశ్వరశాస్త్రి యెదురుగా వున్న ముసలాయనతో.


'అంతే నండి నిజం' అన్నాడు అతడు కూడ.

ఆ విధంగా మాట కలిసి పరిచయమైంది శాస్త్రికి యెదుటి వ్యక్తితో. అలా మొదలైన సంభాషణ క్రమంగా మరింత లోతుకుపోయింది. ఆ సంభాషణవల్ల అతని గురించి కొంత తెలుసుకున్నాడు శాస్త్రి.

అతడొక పొగాకు వ్యాపారి. ఇద్దరు కొడుకులు, కూతురు ఒకర్తె అతని సంతానం. పెద్ద కొడుక్కి పెద్ద చదువు చదివించాలని యెంతో వుబలాటపడ్డాడట. కాని చెడు సహవాసాలుచేసి యింటరు రెండు సార్లు తప్పి యిక సాగలేనని చెప్పి చదువాపి బాధ్యత అన్నది లేకుండా కాలరెత్తుకు వూరిమీద తిరుగుతాడట పెద్దకొడుకు. తర్వాత అమ్మాయి పెళ్లీడు కొచ్చింది. ఇంకేం అది గుండెలమీద కుంపటే పాటలు. దించుకోవలసిన బాధ్యత యెలాగూ వుంది.

ఇక మూడోవాడు అబ్బాయి. పాపం! ఆ అబ్బాయి గురించే జారిపడ్డాడు శాస్త్రి. ఎంతో తెలివైనవాడట. క్లాసులో ఫస్టు మార్కులన్నీ వాడివేనట. ఏదో ఒకసారి తండ్రి యెందుకో కొట్టాడని కోపంతో యిల్లు వదిలి వెళ్లిపోయాడు. ఆ చుట్టుప్రక్కల యెంత వెదికినా దొరకలేదు. తెలిసిన బంధువులందరికి కబురు పంపి తెలుసుకున్నాడు. చివరికి పేపర్లో ప్రకటన వేశాడు జాడ తెలిపినవారికి వుచిత బహుమతి యిస్తామని. మూడేళ్లయ్యాక ఎవరో ఆ కుర్రవాణ్ని గమనించి, మంచి వేసి యింట్లో వుంచుకొని తల్లిదండ్రులకు తెలియపర్చారు. ఇప్పుడు అతడు చేస్తున్న ప్రయాణం కొడుకుదగ్గిరికే. అతని ప్రక్కనే అతని భార్య వున్నాది. ఆమె ముఖంలో సంతోషం లేదు, విచారంలేదు. ఏదో నిశ్చలంగా వుంది. కాని నిజానికి ఆమె మనస్సులో కొడుకు విషయమై సంతోషం, విచారం కూడ వున్నాయి, అని తెలుసుకున్నాడు శాస్త్రి.

ఇంతకాలం ఆమె కొడుకు కనిపించక




ఏమయ్యాడో అనే ఆందోళనతో రాత్రుళ్లు పీడ కలలతో యమయాతన అనుభవించిందట. ఆమె భర్త చెబుతూంటే శాస్త్రి వింటున్నాడు. ఆమె ఒక్కమాట కూడ మాట్లాడ్లేదు.

'జీవితమంటే మరేమీ కాదండీ. రంగురంగుల యింద్రధనస్సును పట్టుకోవాలని పడే ప్రయాస. అంతే' అని వ్యాఖ్యానించాడు అతడు చివరికి.

ఆ వ్యాఖ్యానంలో రోత స్పష్టంగా వినిపించింది శాస్త్రికి.

'చాలమందికంటె తను సుఖంగానే వున్నాడేమో' అని క్షణంకాలం అనుకున్నాడు శాస్త్రి.

రైలు స్పీడు కొద్దిగా తగ్గి మళ్లీ అంతలోనే పుంజుకున్నది. తర్వాత స్టేషన్లో ఆ భార్యాభర్తలిద్దరు దిగిపోయారు. వాళ్లగురించే ఆలోచిస్తూ కిటికీలోనుండి బైటికి చూస్తున్నాడు శాస్త్రి. ఆ సమయంలో అతనికి చటుక్కున ఒక విషయం గుర్తుకొచ్చింది 'అరె! చాలా అతనిగురించి తెలుసుకున్నానే కాని యింతకీ అతని పేరు...?'

కంపార్టుమెంటులో నలుగురైదుగురు మగాళ్లు పేకాడుతూ మధ్యమధ్య గొల్లుమని నవ్వులు తప్పిస్తే మరోశబ్దంలేదు. ఇంతలో ఒక ఆరేళ్ల అమ్మాయి గబగబ వచ్చి శాస్త్రి కూర్చున్న చోటుకి యెదురుగా వున్న కిటికీ ప్రక్కన కూర్చొని 'అమ్మా రావే ఇక్కడ మంచి జాగా దొరికింది' అంటూ అరిచింది, కిటికీలోంచి బైటికి వుత్సాహంగా చూస్తూ.

'ఆ పెట్టె జాగ్రత్తగా అదిగో మా అమ్మాయి కూర్చున్న బల్లక్రింద పెట్టు బాబూ' అని అంటున్నాది ఆ అమ్మాయి తల్లి కాబోలు పోర్టరుతో. ఆమె కంఠస్వరం విని అప్రయత్నంగా తల తిప్పి చూశాడు శాస్త్రి. ఆమెను సులభంగా గుర్తుపట్టగలిగేడు. ఆమె కూడ అతన్ని చూసింది.

విచ్ఛిన్నం లేకుండా తదేకంగా శాస్త్రి చూసిన చూపులో యవ్వనకాలపు స్మృతులు రేగి మార్మోగాయి.

'సుఖంగా వున్నావా శ్యామలా ?' అని అడిగాడు

కొంచెం తడబడింది. అంతలోనే సంతో

మంతో 'ఆఁ, సుఖంగానే వున్నాను.' అని 'మీరు బాగున్నారా ?' అని అడిగింది శ్యామల.

'ఆఁ బాగులేకేం' అన్నాడు శాస్త్రి సంక్షిప్తంగా. ఆమె సర్దుకొని సీట్లో కూర్చుంది. ఆమెగురించి యెన్నో అడగా లనుంది అతనికి. అలాగే ఆమెకూడ అను కున్నాది. ఐనాకాని పిరికి పందల్లా యెవరికి వారె ఒదిగిపోతున్నారు.

శ్యామల కూతురు తదేకంగా గబగబ పారిపోతున్న ప్రకృతిని చూస్తూ తన్ను తాను మర్చిపోయింది. హఠాత్తుగా 'అమ్మా, చూడవే అల్ల కొండల్లోనుంచి పొగలొస్తు న్నాయి' అని అరిచి అంతవరకు వున్న నిశ్శబ్దాన్ని పారద్రోలింది. దాంతో కొంచెం ధైర్యం కలిగినట్లయింది శాస్త్రికి.

'నీ భర్త నీతో రాలేదా శ్యామలా ?' అని ప్రశ్నించాడు.

ఆమె సమాధానం యింకా యివ్వ లేకపోతూంది అతని ప్రశ్నకు—

'ఈ అమ్మాయి ఒక్కతేనా యింకెవ రైనా పిల్లలా ?' అని అడిగాడు శాస్త్రి. దానిక్కూడా జవాబు చెప్పటానికి ప్రయ త్నంతో వుంది శ్యామల.

'అన్నట్టు నాకే విషయాలు తెలుసుకోవ టానికి అవకాశం లేకపోయింది శ్యామలా. నీ భర్త యిప్పుడు గెజిటెడ్ ఆఫీసరు అయ్యుంటాడనుకుంటాను.' అని యిక అడగడం ఆపాడు శాస్త్రి. అతని ఆఖరు ప్రశ్న విని జవాబు చెప్పటానికి బదులు శ్యామల నిమ్న వదనయై మరింత ఒదిగి పోయి కూర్చున్నాది.

'మీరు పెళ్లి చేసుకున్నారా ?' సంశ యంగా అడిగింది శ్యామల చివరికి.

'నీకు సంశయం కలిగింది కదూ శ్యామలా. నాకు తెలుసు. లేదు, నేను పెళ్లి చేసుకోలేదు' అన్నాడు విశ్వేశ్వరశాస్త్రి.

'ఎందువల్ల' అని అడగలేదు శ్యామల.

చింతోసేపు మౌనంగా వుండిపోయారు యిద్దరూ.


కడుపు ఆకలి కలిగినట్టు మనస్సుకే ఆకలి వేసింది శాస్త్రికి ఒక్కసారిగా.

శాంతిలేని జీవిత అనుభవాలను యేక వూపిరిమీద చెప్పసాగాడు. చెబుతూ తదేక దృష్టితో శ్యామలను చూస్తూ మధ్యమధ్య నిట్టూర్పులు విడువసాగాడు శాస్త్రి. నీల

గురించి కూడ చెప్పాడు, చెప్పడమే కాదు. ఒక వున్మాదిలా వర్ణించాడు. అతడలా వర్ణిస్తూంటే 'యెవరీ నీల' అనే ప్రశ్నతో వులిక్కి పడింది శ్యామల. ఆమెకెన్నో సంశ యాలు కలిగాయి.

'.. నీలకు పెళ్లైంది. వరుణ్ణి పెళ్లి పీటల మీద చూసాను. నాకెందుకో అను మానం కలిగింది శ్యామలా, నీల సుఖపడు తుందా అని. ఎందుకలా అనిపించిందంటావ్? ఏదైనా అసూయవల్ల అలా అనుకున్నా నేమో అని కూడ తలపోసాను. ఉహుఁ అదికాదు నిజం. పవిత్రమైన దృష్టితోనే చూసాను' అని ఆగి సాలోచనగా శ్యామల వేపు చూసాడు. అప్పటికి యింకా కొంత బాధ అతని కంఠంలోనుండి రావఁసివుంది. కాని అది రాలేక పోయింది శ్యామలను చూసాక.

శ్యామల తలొంచుకొని వుంది. ఆమె కొద్దిగా నవ్వుతున్నట్టుగా కూడ వుంది. ఆ నవ్వు కప్పి పుచ్చటానికే తల అలా దించుకున్నా దేమో అనిపించింది. ఆ సమయంలో ఆమె మోహంలో నవ్వుచూసి శాస్త్రి బాధ పడ్డాడు. ఆమెను మనస్సులో తీవ్రంగా నిందించాడు. అలాంటి శ్యామలతో యిక మాటాడకూడదని, అనవసరమని అను




కున్నాడు. ఐనాకాని ఒకమాట అడగకుండా వుండలేక పోయాడు చివరికి :

'శ్యామలా. ఒకటడుగుతాను చెప్పు. అశాంతి అధికమైతే సంశయాలు వుద్భ విస్తాయా మనిషిలో, లేకపోతే సంశయాలు యెక్కువవ్వడంవల్ల అశాంతి కలుగు తుందా ? చెప్పు శ్యామలా.'

శ్యామల తలెత్తి ఒకసారి అతన్ని చూసి మళ్లీ తల దించుకొని, 'నిజంగా చెప్తు న్నాను. ఈ ప్రశ్న యింతవరకు నా జీవి తంలో కలగ లేదు. కాని, యిప్పుడు విశా ప్రశ్న వింటూంటె 'అర్థంలేని సంశయాల సంఘర్షణమే అశాంతి' అనే జవాబు కూడ మీరే చెబుతున్నట్టు స్పష్టంగా అనిపిస్తు న్నాది నాకు' అన్నాది శ్యామల. ఆమె కంఠ స్వరంలో కఠినత్వ మున్నట్టు తోచింది శాస్త్రికి. ఏమీ మాటాడలేక పోయాడు. ఒక పెద్ద నిట్టూర్పు మాత్రం అతన్లో నుండి బైటికొచ్చింది.

శ్యామల ధైర్యంగా కూర్చొని బైటికి చూస్తూంది వర్షం పడుతున్నది బైట. రైలు ఒక పెద్ద స్టేషనుకొచ్చి ఆగింది. శ్యామల శాస్త్రితో చెప్పి సామాను పట్టించుకొని దిగి పోయింది. ఆమె దిగి పోతున్నప్పుడు యెటువంటి విశేషం జరగ లేదు విశ్వేశ్వరశాస్త్రి మనస్సులో. గుండె స్పందన స్పీడు విషయంలో కొంచెం విరామం తీసుకున్నట్టు అయింది గాని మళ్లీ వెంటనే సద్దుకొని మామ్మూలుగా సాగిపోయింది.

ఇంతలో శ్యామల కూతురు కిటికీదగ్గిరి కొచ్చి 'వెళ్లొస్తాను మామయ్యా' అని చెప్పి తుర్రుమంది తల్లిదగ్గిరికి.

వెళ్లిపోతున్న తల్లీ కూతుళ్ల వేపు చూస్తూ నవ్వుకున్నాడు శాస్త్రి. అలా కొంతసేపటి వరకు తనలో తాను నవ్వు కుంటూనే వున్నాడు. హఠాత్తుగా ఆ నవ్వు ఆగిపోయింది. అతని మొహంమీద ఏదో తలచుకొని యెంతో సిగ్గులో అతని మొహం యెర్రగా తయారయ్యింది. తలెత్తాడు.

వర్షం పడ్డం వల్ల రైలుపట్టాలు తడిసి మెరుస్తున్నాయి. అంతవరకు తన మన స్సులో సంకీర్ణమై వున్న భావం తొలగి పోయి ప్రశాంతత చిక్కినట్టు తనేదో బాగుపడినట్టు తోచింది విశ్వేశ్వర శాస్త్రికి.